# తిరుపతి కథలు

ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి

ఎమెస్కో

# స్వర్ణముఖి

అప్పుడే క్లాస్ అయింది... క్లాస్ చెప్తూనే క్యాంటీన్‌కు వెళ్ళి టీ తాగే అలవాటుంది. ఎస్వీయూ మెయిన్ క్యాంటీన్ జనాలతో నిండి ఉంది... విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు, బయటినుండి వచ్చిన వారితో క్యాంటీన్ కళకళలాడి పోతోంది... కొన్ని టేబుళ్లు బాయ్‌ఫ్రెండ్స్, గర్ల్ ఫ్రెండ్స్ కబుర్లతో... టీ కప్పుల, గ్లాసుల శబ్దాలతో జనాల రణగొణ ధ్వనులతో ఎవరి లోకం వారిదేనన్నట్లుంది... నా కళ్ళు ఏ టేబుల్ ఖాళీగా ఉందో వెదుకుతున్నాయి.



స్వర్ణముఖినది ఒడ్డున శ్రీకాళహస్తి

"రాబా, రా..." అంటూ జియాలజీ ప్రొఫెసర్ కృష్ణారెడ్డి చెయ్యెత్తి నన్ను పిలిచాడు.

విష్ చేసి నవ్వుతూ వెళ్ళి అక్కడ ఖాళీగా ఉన్న కుర్చీలో కూర్చున్నాను.

"మీట్... ప్రొఫెసర్ జనార్దన్ రాజు... ఫ్రం జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీ, న్యూఢిల్లీ. ఈయన మన తెలుగు వారే... ఈయన స్వర్ణముఖినదికి సంబంధించిన వివరాలను తెలుసుకోవడానికి వచ్చాడు" అని అంటూ రాజును పరిచయం చేశాడు.

"మీకు స్వర్ణముఖి తెలుసా" అని నన్ను అడిగాడు రాజు

"బాగా తెలుసండి" అన్నాను నేను

"ఈయనకు అన్నీ తెలుసు... ఈయన స్థానిక విషయాలకు సంబంధించి అనేక పుస్తకాలను రాశాడు" అన్నాడు కృష్ణారెడ్డి.

"మీకు స్వర్ణముఖి పురాగాథలు, ఐతిహ్యాలు తెలుసా?" అడిగాడు రాజు

"తెలుసు" అన్నాను నేను.

"ఇక్కడ శబ్దం ఎక్కువగా ఉంది... టీ తాగాక, జియాలజీ డిపార్ట్‌మెంటుకు వెళ్ళి మాట్లాడుకుందాం... కాసేపు మాతో ఉంటావా?" అంటూ అడిగాడు కృష్ణారెడ్డి.

"అలాగే" అన్నాను నేను.

అందరం కలసి టీ తాగి జియాలజీ డిపార్ట్‌మెంట్‌కు వెళ్ళాం... అక్కడ కృష్ణారెడ్డి పెద్ద మ్యాపును టేబుల్‌పై పరిచాడు.

"ఒకప్పుడు స్వర్ణముఖి తిరుపతి కొండను ఆనుకొని ప్రవహించేది... వర్షాల మూలంగా వేల సంవత్సరాలు కొండ మట్టి, రాళ్ళు దొర్లి పడడంతో స్వర్ణముఖినది పక్కకు నెట్టివేయబడింది... అలా ఐదు కిలోమీటర్ల వరకు జరిగిపోయింది..." అని మ్యాపు చూపిస్తూ అన్నాడు కృష్ణారెడ్డి.

నాకు ఆశ్చర్యమనిపించింది. భూగర్భశాస్త్ర పరిశోధనలు నమ్మక తప్పదు. ఇప్పటికీ తిరుపతి కొండ ఏటవాలుగా జారినట్లే ఉంటుంది. స్వర్ణముఖి నది పుట్టుక, పరీవాహక ప్రాంతం, నది ఒడ్డునున్న పుణ్యక్షేత్రాలు, ప్రముఖ ఊర్లు, సముద్రంలో కలిసే చోటును కృష్ణారెడ్డన్న మ్యాపు ద్వారా చూపిస్తూ వివరించడం మొదలు పెట్టాడు.

"స్వర్ణముఖినది చంద్రగిరి కొండల్లో అగస్త్యాచల సమీపంలో అంటే పి. కొత్తకోట పక్కనుండే ఆదినేపల్లి గ్రామంలో పుట్టిందన్న మాట" అంటూ ఆలోచనల్లో పడ్డాడు రాజు.

"ఏమిటి మీ అనుమానం" అన్నాడు మరో జియాలజి ప్రొఫెసర్ వెంకట్రామ్.

"ఏమీ లేదు ! నది వేంకటేశ్వరుని పాదాల చెంత పుట్టిందని విన్నానే...? చూస్తుంటే చంద్రగిరి కొండల్లో పుట్టిందే?" అన్నాడు రాజు.

"చంద్రగిరి ఉండేది శ్రీవారి పాదాల చెంతేగదా?" అన్నాను నేను.

"ఓహో... ఐతే ఓకే" అన్నాడు రాజు.

"స్వర్ణముఖి పుట్టిన చోటనుండి కొంత దూరం పయనిస్తూనే, చంద్రగిరి, శ్రీనివాస మంగాపురాల దగ్గర కళ్యాణి, భీమా ఉపనదులను కలుపుకొంటూ తొండవాడ అగస్త్యేశ్వర ఆలయం ముందు సంగమిస్తుంది. అందుకే అగస్త్యేశ్వర క్షేత్రం త్రివేణీ సంగమం అయింది" అన్నాడు కృష్ణారెడ్డన్న.

"అయితే అగస్త్యేశ్వరాలయం చాలాప్రసిద్ధి చెంది ఉండాలే?"అన్నాడు రాజు.

"అవును చాలా ప్రసిద్ధి చెందింది. ఆ ఆలయం సంగతి తర్వాత చెప్తాను. ఇక్కడి నుండి స్వర్ణముఖి శానంభట్ల, పైడిపల్లి, గొల్లపల్లి, చిగురువాడ, యోగుల మల్లవరం, తిరుచానూరు, జియ్యరుపాళెం, శ్రీకాళహస్తి, నాయుడుపేట మీదుగా ప్రవహించి, వాకాడు చేరుకొని అక్కడ్నుండి సిద్ధవరం సమీపంలో బంగాళాఖాతంలో కలుస్తుంది" అంటూ మ్యాపును చూపిస్తూ వివరించాడు కృష్ణారెడ్డన్న.

"సార్! జీపు రెడీ" అంటూ డ్రైవర్ వచ్చి చెప్పాడు.

"శీనూ! పనేమీ లేకపోతే మాతోపాటు స్వర్ణముఖి నదిని చూడడానికి రావొచ్చు కదా?" అన్నాడు కృష్ణారెడ్డన్న.

"సరే" అని తలూపాను.

జియాలజీ విభాగానికి చెందిన అధ్యాపకులు సాయి, బాలు, హనుమంతు, వెంకట్రామ్, కృష్ణారెడ్డి, రాజు అందరం జీపెక్కాం... మళ్ళీ జీపులో స్వర్ణముఖికి సంబంధించిన విషయాలను చర్చించుకుంటూ బయలుదేరాం...

"మన పురాణాలు స్వర్ణముఖి పుట్టుకకు సంబంధించి ఏం చెబుతున్నాయ్?" అని నన్ను ప్రశ్నించాడు రాజు.

"కైలాసంలో జరుగుతున్న శివపార్వతుల పెండ్లిని చూడడానికి ముక్కోటి దేవతలు హాజరవుతారు. ముక్కోటి దేవతల భారం వల్ల భూమి కైలాసం వైపుకు వంగి పోతుంది. ఇలా ఉత్తరం వైపు భూమి ఒరిగి పోవడాన్ని చూసిన శివుడు, అగస్త్య మహామునిని పిలిచి దక్షిణం వైపుకెళ్ళి భూభారాన్ని సమంగా సరిచేయమన్నాడు. అగస్త్యుడు అందుకు అంగీకరించి దక్షిణాదికి బయల్దేర్తాడు. దారిలో వింధ్యపర్వతం ఆకాశమంత ఎత్తుకెదిగి తనకెవ్వరూ సాటిలేరని సూర్యునికి అడ్డు తగులుతుంటుంది. దానిని గమనించిన అగస్త్యుడు వింధ్యపర్వత గర్వాన్ని అణచదలుస్తాడు. తాను దక్షిణాదికి వెళ్ళి తొందర్లో తిరిగివస్తానని చెప్పి, అంతవరకు అణిగి ఉండమని వింధ్యపర్వతాన్ని కోర్తాడు. వింధ్యపర్వతం తన పొడుగును తగ్గించుకొని అగస్త్య మహామునికి దారినిస్తుంది. అగస్త్యుడు దక్షిణాది కొస్తూనే భూమి సమతుల్యమౌతుంది. అందుకే 'అందరూ ఒక ఎత్తు అగస్త్యుడు ఒక ఎత్తు' అనే సామెతొచ్చింది. అగస్త్యుడు తిరిగి వస్తాడని వింధ్యపర్వతం ఎదురు చూస్తూనే వుందట.

అగస్త్యుడు దక్షిణాదిన వుండే గోదావరి, కృష్ణా నదుల్లో స్నానాలు చేసి ద్రాక్షారామం, శ్రీశైలం వంటి పుణ్యక్షేత్రాలను దర్శించి శ్రీకాళహస్తికొస్తాడు. అక్కడ స్నానం చేయడానికి ఒక్క నది కూడా కనిపించదు. అక్కడి మునుల కోరిక మేరకు అగస్త్యుడు గంగ కోసం శ్రీకాళహస్తికి కొంత దూరంలోని చంద్రగిరి కొండల్లో శివుని కోసం తపస్సు చేశాడు.